

న్యూ బోయిన్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న లిఫ్టులో ఇరుకున్న కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత

## లిఫ్టులో ఇరుక్కుపోయిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

- సురక్షితంగా బయటపడ్డ లాస్య నందిత

కంటోన్మెంట్, డిసెంబర్ 24: న్యూ బోయిన్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న లిఫ్టులో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత ఇరుక్కుపోయారు. ఆదివారం ఓ ఆస్పత్రి వార్షికోత్సవానికి ఎమ్మెల్యే లాస్యనందిత హాజరయ్యారు. ఆస్పత్రిలోని మూడో అంతస్తుకు వెళ్లేందుకు ఎమ్మెల్యే లిఫ్టు ఎక్కారు. ఆమెతో పాటు పరిమితికి మించి లిఫ్టులో ఎక్కువగా ఎక్కారు. సాంకేతిక లోపం కారణంగా డోర్ మూసుకుపోయింది. అనంతరం సెల్లార్‌లోకి లిఫ్టు వెళ్లిపోయింది. దీంతో 15 నిమిషాలపాటు అందులోనే ఎమ్మెల్యే ఉండిపోయారు. కాసేపు ఆస్పత్రిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రి సిబ్బంది డోర్లను పగులగొట్టడంతో ఎమ్మెల్యే బయటకు వచ్చారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వార్షికోత్సవాన్ని యథావిధిగా నిర్వహించారు.

## అంతర్ జిల్లా తైక్వాండో ఓవరాల్ టీమ్ చాంప్ హైదరాబాద్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, డిసెంబర్ 24: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా తైక్వాండో ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను హైదరాబాద్ జిల్లా జట్టు సొంతం చేసుకోగా.. రంగారెడ్డి జిల్లా జట్టు, నిజామాబాద్ జిల్లా జట్టు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఆర్.ప్రేమ్ రాజ్ పాల్గొని బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడా రంగాన్ని విశ్వక్రీడా నగరంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ కోశాధికారి కె.మహేశ్వర్ సాగర్ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా తాత్కాలిక ప్రాతిపదికన ఉన్న కోచ్‌ల సర్వీసును క్రమబద్ధీకరించి.. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కొత్త కోచ్‌ల నియామకం చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ సాధన చేసి ఒలింపిక్ క్రీడలలో పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చాతిరి బాబూరావు సాగర్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ వాహీద్ తదితరులు బహుమతులు అందజేశారు.

## స్విగ్గీ బాయ్ మృతిపై సమగ్ర విచారణ..

జూబ్లీహిల్స్, డిసెంబర్ 24: స్విగ్గీ డెలివరీ బాయ్ మృతిపై కార్మిక శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న సమయంలో భవనం పైనుంచి పడి మృతి చెందాడు. గిగ్ కార్మికుల సంక్షేమానికి సీఎం ప్రకటన నేపథ్యంలో ఘటన పూర్వాపరాలు సేకరించేందుకు హైదరాబాద్ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బి.శ్యామ్ సుందర్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులతో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ శ్యామ్ సుందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మృతుడి కుటుంబసభ్యులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్ గౌడ్, సహాయ కార్మిక అధికారులు ప్రమీల, మాధురి థెరిస్సా, కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్ యాదవ్, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిగ్‌బాస్ గొడవ.. మరో ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబర్ 24: బిగ్‌బాస్ ఫైనల్స్ అనంతరం జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద ఫ్యాన్స్ విధ్వంసం కేసులో అరెస్టులు కొనసాగుతున్నాయి. ఈ కేసులో బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌తో సహ ఇప్పటికే 20 మందిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్‌కు చెందిన హరినాథ్‌రెడ్డి(20) అనే విద్యార్థితో పాటు యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద హోటల్‌లో పనిచేస్తున్న ఎం.సుధాకర్ (23) అనే యువకుడు గొడవల్లో పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు ఇందిరానగర్‌కు చెందిన పవన్ (22) అనే ఆఫీస్ బాయ్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# నిర్లక్ష్యానికి నిలువెత్తు మన పోలీసులు..!

- ఫిర్యాదు చేసినా గుర్తించని వైనం
- హిట్ అండ్ రన్‌లో చికిత్స పొందుతూ యువకుడి మృతి
- అదే ఠాణాలో కుమారుడు అదృశ్యమంటూ తల్లిదండ్రుల ఫిర్యాదు
- 20 రోజులుగా కొడుకు కోసం గాలింపు
- అదృశ్యమైన వ్యక్తే మృతిచెందాడన్న విషయాన్ని గుర్తించలేని పోలీసులు
- పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఠాణా ఎదుట బంధువుల ఆందోళన

సిటీబ్యూరో/చాదర్‌ఘాట్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): పోలీసులకు ఎంత టెక్నాలజీ అందించినా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండొద్దని చెబుతున్నా.. ఇటీవల క్షేత్ర స్థాయిలో ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనే పోలీసుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది. తప్పిపోయిన కొడుకు కోసం తల్లిదండ్రులు 20 రోజులుగా వెతుకుతున్నా...రోడ్డు ప్రమాదానికి గురై, మృతి చెందింది అతడేనన్న విషయాన్ని గుర్తించలేని స్థితిలో పోలీసులు ఉండటం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మూడో రోజు అతడు మృతి చెందాడు. అనాథ శవంగానే మృతదేహాన్ని భద్రపరిచారు. అదృశ్యమైన కొడుకు ఐదు రోజులైనా ఇంటికి రాకపోవడంతో అదే పోలీస్‌స్టేషన్‌లో తన కొడుకు కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినా కూడా చాదర్‌ఘాట్ పోలీసులకు చీమ కుట్టినట్టు కూడా కాలేదు. కుటుంబసభ్యులే దవాఖానలు, బస్టాండ్లు తిరుగుతూ.. తన కొడుకు మృతదేహం ఉస్మానియా మార్చురీలో ఉన్నదని తెలుసుకున్నారు. పోలీసుల నిర్లక్ష్యానికి ప్రత్యక్షంగా నిలిచిన ఈ ఘటనను నిరసిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి.



### పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..

చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరగడం, చికిత్స పొందుతూ అతడు మృతి చెందడం, అదే పోలీసు స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు కావడం.. ఈ మూడు జరిగినా పోలీసులు కనీసం పట్టించుకోలేదని, 20 రోజులుగా నగర వ్యాప్తంగా తిరుగుతున్నా పోలీసులకు చీమ కుట్టినట్లు కూడా లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే, చేసిన తప్పు పెద్దది కాకుండా ఉండేందుకు పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

### ఎందుకీ నిర్లక్ష్యం..?

హిట్ అండ్ రన్ కేసులను పోలీసులు సీరియస్‌గా తీసుకుంటారు. కానీ, చాదర్‌ఘాట్ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం వెనుక ఏమి జరిగిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నల్గొండ క్రాస్‌రోడ్డులో సీసీ కెమెరాలున్నాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు గుర్తించే అవకాశం లున్నాయి. యువకుడు గుర్తు తెలియని వ్యక్తి కావడంతో, వాహనాన్ని గుర్తించి వదిలేశారా..? ఇంకా ఏదైనా జరిగిందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాదర్‌ఘాట్ పోలీసులపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చాయి. మనుషుల ప్రాణాలను లెక్క చేయకుండా నిద్రలో ఉన్న పోలీసులపై ఉన్నతాధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో ఎవరు విధులు నిర్వహించిందని లేదనే ఆరోపణలకు ఈ ఘటన ప్రత్యక్షంగా నిలుస్తున్నదని పలువురు పేర్కొంటున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన వారి కోసం గాలిస్తున్నామంటూ చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి నల్గొండ క్రాస్ రోడ్డు చౌరస్తాలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియాలో గుర్తుతెలియని వ్యక్తిగానే రికార్డులో నమోదు చేయించారు. చికిత్స పొందుతూ అతడు ఈ నెల 9వ తేదీన మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తిగా ఉండటంతో ఆ మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచారు.

### అదృశ్యం కేసు నమోదు..

బయటకు వెళ్లిన కొడుకు శ్రావణ్‌కుమార్ (23) ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి ఫొటోను చూపిస్తూ ఈ నెల 11న మలక్‌పేటలో ఉండే తల్లిదండ్రులు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. లుక్ అవుట్ నోటీస్ కూడా జారీ చేశారు. అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడిని దవాఖానలో చేర్పించిన పోలీసులు.. అతడు మృతి చెందాడనే విషయంపై ఏ మాత్రం పట్టించుకోలేదు. మార్చురీలో ఉన్న మృతదేహం ఎవరిదనే విషయాన్ని కూడా పట్టించుకోలేదు. కుటుంబ సభ్యులే శ్రావణ్ కోసం గాలించారు. ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని గుర్తించి, వారే చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారమిచ్చారు.

## ఉద్యోగాల పేరుతో మోసం

### నోయిడాలో కాల్‌సెంటర్ నిర్వాహకుడి అరెస్టు

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలంటూ అమాయకులకు ఫోన్లు చేయిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక కాల్‌సెంటర్ నిర్వాహకుడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగర జాయింట్ సీపీ(క్రైమ్స్) ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. ఉద్యోగాల కోసం జాబ్ పోర్టల్స్‌లో తమ బయోడేటాలను అప్‌లోడ్ చేసేవారి డేటాను ఆ పోర్టల్ నుంచి కొనుగోలు చేసి.. అందులో ఉన్న ఫోన్ నంబర్లు, ఇతర వివరాలతో బాధితులకు ఫోన్ చేయిస్తున్నాడు. ఉత్తర్‌ప్రదేశ్, నోయిడాకు చెందిన విజయ్‌కాంత్ నోయిడాలో ఒక కాల్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఆయా జాబ్ పోర్టల్స్ నుంచి కొనుగోలు చేసిన డేటాను టెలీకాలర్స్‌కు అందిస్తాడు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఫోన్ చేసి నమ్మిస్తుంటారు. ఉద్యోగమనగానే అమాయకులు గంతేసి నేరగాళ్లు చెప్పినట్టు వింటున్నారు. రిజిస్ట్రేషన్, హెల్త్ చెకప్, డిపాజిట్స్.. పేరుతో నేరగాళ్లు అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత నేరగాళ్లు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించి మోసం చేస్తున్నారు.

#### రూ. 2.20 లక్షలు స్వాహా

నాంపల్లికి చెందిన బాధితుడికి ఫోన్ చేసిన నేరగాళ్లు.. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి మాట్లాడుతున్నట్టు చెప్పారు. మీరు ఉద్యోగానికి ఎంపికయ్యారంటూ.. రిజిస్ట్రేషన్ ఫీ, సాలరీ అకౌంట్ ఓపెనింగ్ ఫీ, యూనిఫామ్ ఫీ, ఆఫర్ లెటర్ ఫీ.. అంటూ బాధితుడి నుంచి రూ. 2.20 లక్షలు వసూలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



#### నోయిడాలో అరెస్టు..

నిందితులు నోయిడాలోని ఓ కాల్ సెంటర్ నుంచి ఫోన్ చేస్తున్నట్టు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు నేతృత్వంలోని బృందం అక్కడికి వెళ్లి కాల్‌సెంటర్‌పై దాడి చేసింది. నిర్వాహకుడు విజయ్‌కాంత్‌ను అరెస్ట్ చేసి నగరానికి తరలించారు. నిందితుడి వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు, 23 మొబైల్స్, చెక్‌బుక్స్, బ్యాంక్ కార్డులు, 80 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

## మహేంద్ర కంపెనీ మేనేజర్‌నంటూ.. అమాయకులకు బురిడీ

- రాజమండ్రి ముఠా అరెస్టు

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మహేంద్ర కంపెనీ మేనేజర్‌నని చెప్పుకుంటూ.. కంపెనీ డెమో కార్లు తక్కువ ధరకు ఇస్తామంటూ నమ్మించి మోసం చేస్తున్న రాజమండ్రికి చెందిన ఒక ముఠాను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) కథనం ప్రకారం.. రాజమండ్రికి చెందిన తాడి నవీన్‌కుమార్, కంచెర్ల మధు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్ వ్యాపారులు. తమకు తాముగా బ్యాంకు మేనేజర్లుగా చెప్పుకుంటూ.. ఫోన్లు చేసి అమాయకులను మోసం చేస్తుంటారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన రత్నంకు ఫోన్‌చేసి.. తాను మహేంద్ర సీఐఈ, ఆటోమెటివ్ లిమిటెడ్ మేనేజర్‌ను, తన పేరు చంద్రశేఖర్‌గా పరిచయం చేసుకొని ఫోన్ కాల్ మాట్లాడాడు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు ఇండస్ట్రియల్ పార్కులో తమ క్లైయింట్ కంపెనీ పెడుతున్నాడని, దానికి సెక్యూరిటీ సర్వీసెస్ కూడా మీరే కల్పించాలని, జనవరి 25 నుంచి సిబ్బంది విధుల్లోకి రావాల్సి ఉందన్నారు. ఇలా పరిచయం చేసుకున్న బాధితుడితో తమ కంపెనీ ఆర్ అండ్ డీ కోసం తెచ్చిన డెమో వాహనాలు తక్కువ ధరకు వస్తాయంటూ నమ్మించారు. రెండు బోలేరో ఎస్ ఎల్ఎక్స్ అందుబాటులో ఉన్నాయని, కావాలంటే మీకు ఇప్పిస్తానంటూ నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు రూ. 3,54,236లను నిందితులు సూచించిన ఖాతాలోకి బదిలీ చేశాడు. ఆ తరువాత సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ నేతృత్వంలోని ఎస్సై వెంకటాద్రి బృందం కేసు దర్యాప్తు జరిపి నిందితులు రాజమండ్రికి చెందిన వారుగా గుర్తించి అరెస్ట్ చేశారు.